కథా నిలయం
5040
శ్రీకాకుళం

# నాగి

పట్నంల సదువు సాలిచ్చిండు రాంరెడ్డి. పట్నవాసం ఇడ్సి పల్లెల కాలువెట్టంగనే గంగాళంలచాప చెర్లవడ్డట్లనిపిచ్చింది. ఇంగ పంజిరం ఇడ్సిన చిల్కరాజోలె రెక్కలు సళ్ళిడిసిండు. పుర్రెకోబుద్ధి జివ్వకోరుచి అన్నరు. ఎలెక్ట్రేరుదీపాలు, బిజిలిపంకలు, సీనిమ్మలు, హోటర్లు, మోటర్లు ఉంటెగని బత్కలేరుకొంతమంది. మరికొంతమందికి అవిఅంటెనె సీదర. సుక్కలపర్వతం దాకేటట్లు బంగులాలున్న గని సిప్పెడుసోటు ఉత్తగుండదు. ఆ సిమింటు అరలల్ల ఊపిరే మళ్ళదు. ఇటువోతె మంచం దగిలె అటువోతె కుర్చీదగిలె. ఎండకాలం పంకాలకింద గూసోని కూసోని "గాలిదేవుడంటె నడుమబొడ్డె. ఆ బొడ్డెనడుమ కన్నున్నమూడురెక్కల పక్షి ముక్కుముడ్సుకకూసున్న బొమ్మ" అని రొండు తరాలుదాటి పోరగాండ్లకు పొయ్యిలల్ల రాసిపెడ్తరో ఏందో! ఇంతకు సందమామ ఉండదో ఊడిందో ఎవరికెర్క ఇర్కాటపు అరలల్ల పడీపడి ఊపిరిసల్పక జర మంచి గాలివీలుత్త మనిపోతె బాగెఆమ్‌కు పోవాలె. లేకపోతె ట్యాంకుబండుకు పోవాలె. ఆడ్కిపోవాల్నంటె నడ్సుకుంటవోతె నడ్డినీల్లుతది. కాళ్ళు నొయ్యకుండ జేరాల్నంటె రొండుబస్సులు ఎక్కిదిగాలె. నూకుళ్ళు దొబ్బుళ్ళు, ఇన్నితాకట్లువడి ఆడ్కివోతె ఆడేం సక్కన? జనజాతర ఊకున్ననరాలకు ఉడ్కుఎక్కిచ్చేటట్లు తీరొక్కపోరి తైతక్కలు! దాని తాకుళ్ళు! మాడపోటొచ్చేరంతులు, శూలనొప్పిపుట్టిచ్చే మిర్పకాయబజ్జీలు, మూడుదినాలు ముర్గిన మసాలాకట్లెట్లు; కబాబులు! ఇవిటికన్న గుర్గిల ఇంగులంబోసి అప్పటి కప్పుడుజేసి, ఆ గంటబండ్యోడు అమ్మె ఆ కారపు శెనిగెలే నయం, పంటి కింతఆసర; నోటికింతరుచి అన్నఉంటది. గిన్నితంటాలల్ల యాదంట దప్పిచ్చుకోని తిరుగాలె. ఇంటి అరలల్ల కన్న ఊపిరిసలుపని వొల అది. మంచిగాలి, నీళ్ళు అనుకుంట హవాకోరి కని ఆమెడదూరం ట్యాంకుబండనిబోతె; ఆడున్న ట్యాంకు కన్న ఎక్కువ బండే గండ్లవడ్తది. పట్నంఇడ్సి పదామెడదూరం ఎప్పుడు పోదమా అని ఉంటరు.

పల్లెల అడ్గువెట్టిన కాణ్ణుంచి పొద్దుమూకి మూడురఘ్గాంలకు ఊరబాయికిపోయి ఈతగొట్టుకం అలవాటైంది రాంరెడ్డికి, ఆ ఊళ్ళ తన తోటి అంత కలెగల్పుగ మాట్లాడే టోళ్ళు ఎక్కువమంది లేరు. చిన్ననాడు రాజారాజాగుమ్మడికాయ, గోటీలు, గిల్లిదండ ఆట లాడినప్పటి జతగాండ్లు ఒకరో ఇద్దరో ఉన్నరుగని, ఈయన పట్నంబోయి పెద్దసదువు సదువుకోని వొచ్చినమోతేబరి రైతుకొడుకని జర ఎన్కపట్లువడ్తరు. ఎవ్వరు ఎంటొచ్చినా రాకున్నా దినాం ఊరబాయికివోయి, తనివిదీరంగ నీళ్ళల్లఉండి, అంజనేయగుళ్ళె దీపంబెట్టెట్యాళ్ళకు ఇంటికివస్తుండె.

ఆనాడుగూడ రాంరెడ్డి బాయిల ఈతగొట్టి సాలైనంక దరివట్టుకోని నిలవడి పొడిదోతి కోసం జూస్తె దోతిలేదు. ఇగ ఆ తడిబట్టనె గట్టిగ పిండుకోని బాయిగట్టుమీదికి ఎక్కి, దోతి గాలికి గిన ఎగిరిందేమోనని నాల్గుదిక్కుల కలెజూసిండు. అట్లజూస్తుంటె, సలువజేసిన తెల్లబట్ట గట్టుకోని ఎవరో నిలవడ్డట్టనిపిచ్చింది. దగ్గరికి పొయ్యేసరికి అది తన దోతే, కట్టుకున్నది మొగోడు గాదు; ఆడిపిల్ల, దానిమొలమీద తనదోతి జూసి రాంరెడ్డికి అరికాలుమంట నెత్తికెక్కింది. ఏం దోచక "ఎవరునీవు?" అని అడ్గిన రాంరెడ్డి మాటకుబదులుగ కిలకిలమని నవ్వుఇనవడ్డది. ఈ నవ్వుతోటి రాంరెడ్డికోపం రొండింతలైంది. కోపంబట్టలేక, "దొంగబత్కుపాడుగాను, దొంగతనానికి తోడు సిగ్గు గూడలేదు" అని అనుకుంట జాడిచ్చి చెంపమీదగొట్టిండు. అంత దెబ్బదిన్న నాగి ఉల్కలేదు పల్కలేదు. సూపెటందుకన్న కన్నీళ్ళుగార్చలేదుగని, ఏగిర్తంగ మల్లెపువ్వు అసొంటి దోతియిడ్సి పారేసి, తన పాతపేలిక జుట్టుకొని పోయింది. ఆ పోరిజేసిన ఈ పనిజూసి రాంరెడ్డి నిలువునగూలిపోయిండు. ఆపోరి ఎన్కకుమల్లి, మల్లా తననో చెంపపెట్టు వెట్టినా తన కంత నాదాని గాకుండె గని తనదెబ్బకు పల్లెత్తు ఎదురుమాట వల్కకుండ నిలవడ్డ ఆ పోరి అరడ్గుల రాంరెడ్డిదొర ఉన్కినే గదిలిచ్చి నట్లనిపిచ్చి ఇంటిమొకం బట్టిండు.

నాగి అనంగనె చేతులకలం బట్టి ఊరిమీద పెత్తనంజేపే కరణం దగ్గిరి నుండి ముల్లుగర్ర సేతవట్టి ఊరిసుట్టు గస్తిదిర్గె కావలి, మన్కా రోని దాంక అదోతీరు బుగులు. బుగులనిగాదు గని ఓతీరు తినస్కారము. ఊరన్నఊరును ఊగిచ్చే ఈనాగి యెవరు? మూడుపువ్వులెత్తున్న మూసిన ముత్తెమా? కోట్ల మెరిసి ఏట్ల దేలె కొర్విదయ్యమా? కండ్ల వడకుండ మనిషినెత్తురు దాగె అనుమాన పిశాచమా? ఉన్నోళ్ళ హుండీలు నింపి ప్యాదోళ్ళను సాగనంపే కరువా? అంటే కాదు. అదో దిక్కులేని ప్యాదరాలు. గొల్లమల్లి చిన్నబిడ్డ. యా టక్కులు తాకట్లు దెలువని ఎడ్డిగొల్లోడు సాయిగాడు. వాణిబతు కంత గొర్లగాసుకుంట గట్టు కే వొప్పజెప్పిండు. వాణిపెండ్లాం మల్లి తన కిందికి నీళ్ళొచ్చినా అవుతలికి లేసే తెలివిడి గుడలేని తిక్కది. సాయిగాడుండంగ మల్లీ, మల్లిపిల్లలు కట్టో, పిడ్కో ఏరుకోని, కలో గంజోదాగి ముదురు కుంటుండిరి గని, ఆ నడ్మ సీకట్ల గట్టు దిగి రాంగ, యా పురుగుముట్టిందో, ఏందో, ఆయింత సాయిగాడు గుట్కుమన్నడు. నెత్తిమీదనీడవోంగనె వడదెబ్బలకు కరువా? అన్నట్లు మల్లి నెత్తిముసుగోలెఉన్న సాయిగాడు కాలంజేసినంక మల్లి కాపిరం కంపల వడ్డది. మల్లి పొట్టకు సిప్పెడు గంజి లేకపోయినా, పొట్టనిండ పుట్టెడు పిల్లలు.

మల్లి ఈ పోరగాళ్లందర్ని ఎంటేసుకోని కోడిపెట్టోలె పొట్టగడ్పుకుం టుంటె, పెద్దపోరి ఎదిగొచ్చింది. "పదేండ్లపోరికి పెండ్లిజేయ కుండ ఇంట్ల వెట్టుకున్నదిమల్లి; ఈమిర్గం బూనక ముందు లగ్గం గావాలె. లేకుంటె కులం తప్పువెడ్తం. తప్పు కిందికి దండుగని యాటపిల్ల, కల్లుకుండ దేవాలె" అన్నడు కులంపెద్ద పెద్దగొల్ల. "వాయబ్బ! ఈకడ్పకల్లుపైకంల నాపోరి

నెత్తిన నాల్గుఇత్తులేస్త" నని మల్లి తన కున్న నాల్గు జీవాలు తెగనమ్మి పోరి మెళ్ళ నల్లపూసలు గట్టిచ్చింది. ఎదిగిన పిల్ల ఇంట్ల కెల్లి వోయినంక మల్లిబతుకు మరీ బీడువడ్డది. ఈ సందట్ల మల్లిపోరగాండ్ల కింత అంబలిగూడ యాళ్ళకు దొర్కలేదు. అటుఇటుదేవులాడుకోని నాగి మొగపోరగాండ్ల జతవట్టింది. నాగి మెల్లెగ వష్మిమిరాముల ఎన్కపోయి గుళ్లజొచ్చి అయ్యగారు ఆరగింపు జేసి అవుత లివుతల ఏసిన బలి ముద్దలు దెచ్చు కోని తినేది. రాగిచెట్టుకు ప్రదక్షణజేసి కొబ్బరకాయ గొట్టి దక్షిణ అని ఏసినసైస దొంగులుకోని కోమటి సీతరాముల దుకాణంల బెల్లం గొన్కతినేది. తాటిచెట్టుకు ఎగవడి ఉడుంబాకి నట్లువాకి ఈడ్గిఎల్లప్ప గట్టిన కల్లులొట్టి ఇడ్సి గుడ్డెలుగు వట్టిచ్చినట్లు వట్టిచ్చేది. సింతవల పండ్లొచ్చిన వంటె మండ మండనకుండ ఎక్కి గుడ్లగుడ్లపండ్లన్ని పొట్టనింపుకునేది. ఇంగ చింతలకు సిగురేసుడే కష్టం. చింతకొమ్మలకు యాళ్ళాడవడి వనగాయలు, చింతపువ్వు బర్కి తెచ్చి, దేవునిఅర్గుల మీద వొడ్డెరోళ్ళు మల్సినరోళ్ళల్ల దంచి ముద్దలకు ముద్దలుమింగేది. మనసుమళ్ళినప్పుడు యా సెర్ల నో, బాయి ల్నో కాల్వల్నో వడి ఈతగొట్టి వొచ్చేది.

పాపం! మల్లి పోరగాండ్లను ఎంటేసుకోని కూలినాలి కని పటేలు పట్వారీల ఇండ్లల్ల వడ్లు దంచ వోయేది. ఆకలికి తట పటాయించే మల్లిపిల్లలు దంచె టప్పుడు అవి వడ్లైనా సరే, ఆర్క లైనా సరే, అర్దశేరు గింజలు నోట్లె గుమ్మరిచ్చుకోని, మరో పురుగు జూడకుండ పరపర బర్పటిచ్చి మింగెటోళ్ళు. ఇంగ న్యాలశెనక్కాయె ఏరవోయిందంటె నాగమ్మ అర్దమణుగుకాయ ఆరగింపుజేస్తది. "కండ్లం డంగనె కంట్లె పాపను దీసెటంతటి బంటు దొంగనాగి" అని దాని మాటజెప్తెనె ఆఊళ్ళ ఎవ్వరు కూలి పుట్టనియ్యరు. రెక్కాడ్తె గని బుక్కాడని బత్కు మల్లిది. అయితె కడుపు సిచ్చు కడ్పది, ఆకలికి అవుసురానికి అయింది కాంది అని ఉంది గన్కనా? అందుకోసమే నాగి, పని గినీ, తప్పు ఒప్పు అని సూడకుండ సూటిగ సేతికి దొర్కింది అమురవట్టి ఆకలిదూపలు దీర్చు కొనేది. ఈతీర్గ ఆఊరి సిన్నా పెద్దా అంతాగల్సి నాగిని పచ్చి పగటిదొంగనుజేసిన్రు. అక్కడిక్కడ తండ్లాడి యాది దొరుకని నాడు వో అర్గుకొనాకు గూసోని పట్టపగటింతల్నే పాలు పెర్గుదుత్తలు నెత్తినవెట్టుకోని అమ్ముకుంట వొయ్యెటోళ్ల కండ్లల్ల పిడికెడు దుమ్ముజల్లి, వాళ్ల నెత్తి మీదున్నగుర్గిని పెద్దగద్ద కోడిపిల్లను తన్నుక పోయినట్లు పొయ్యేది. అందుకోసం ఆ ఊళ్ల అందరు నాగిని 'గత్తర'ను, 'మిత్తి'ని జూసినట్లు జూస్తరు. ఏవరేమంటేంది? ఎవ రెట్ల జా స్తేంది? నాగి మట్కు 'మర్నాగి' అని పేరు వోయింది.

దినాం అలవాటు పొంటి ముంజల దొంగతనానికోస్రం చెరువు గట్టుపొంటి ఉన్న తాటితోపులల్లవడి తాటి సెట్టెక్కిన నాగి కన్ను ఊరబాయి గట్టుమీద ఉన్న ఉల్లిపార అసొంటి దోతి మీదవాలింది. అంతె! ఎన్కముందు జూడకుండ సెట్టు దిగొచ్చి, తన వొంటిమీది సీకిరిసింపు ఇడ్సి అవుతల పారేసి, ఆ దోతి సింగారిచ్చుకున్నది. అణ్లె గడియారం గూడ

గండ్లవడ్డది గని, అది తన కెందుకని అక్కణ్ణే పారేసింది; రాంరెడ్డి తోటి సెంపపెట్టుదిన్నది; మర్సింది.

మళ్ళా తెల్లారెట్యాళ్ళకు, రాంరెడ్డివాళ్ళ ఇంటెన్క దక్షిణపు దిక్కు మొక్కజొన్న పెరట్లనే జొరవడ్డది. అప్పుడప్పు డే రాంరెడ్డి లేసి మొకంగడుక్కోని, ఇంటిఎన్క తూర్పుదిక్కు యాపసెట్టుకింద నుల్కమంచం ఏపిచ్చుకోని 'Crime and Punishment' అన్న పుస్తకం జదువుకుంట గూసున్నడు. పుస్తకం సదువుతున్నడు గని, ఆయన సెవులకు మొక్కజొన్న సేండ్ల ఎవరో కంకులు ఇర్సి నట్టు మొక్కకర్రలల్ల నడిమికెళ్ళి పోతుంటె ఆకాకు వొర్సుకోని సప్పుడైనట్లు ఇనవడ్డది. అయితె "యాదో గొడ్డో గోద నో అయిఉంటది. పక్కల్నే బీరడు ఉన్నడు గదా. ఎలగొడ్త" డని మళ్ళ పుస్తకంల దిగిండు. ఇంతట్లనే గుమాస్తరంగయ్య "అమ్మో, నా కండ్లల్లనే కారంగొడ్తావ్ ఈయాళ్ళ నీ తోడ్కెల్ దీస్త, ఇంగ నీ బొక్కలు సున్నం జేయకుంటె సూడు. లంబడిదయ్యెం! బద్మాష్‌ముండ!" అని నడీపుల బలంకొద్ది గుద్దుకుంట గొరగొర ఈడ్సుకుంట వొచ్చి రాంరెడ్డి ముంగల నిలవెట్టిండు.

దాన్ని జూడంగనే గుర్తుపట్టిన రాంరెడ్డికి ఆపోరిమీద ఎక్కడలేని కోపం, అసయ్యం, బుట్టుకొచ్చినవి. సొంతరెక్కలమీద గాక ఇంగోళ్ళకష్టం మీద, దొంగతనంమీద బత్కు అలవాటైన నాగి అసొంటోళ్ళకు బూమ్మీద బత్కేటందుకు హక్కు గాని, అమరికగాని లేదనుకున్నడు. రాంరెడ్డి గట్టుకున్న సోకుసోకుల గాలిమ్యాడల గీ పిల్ల పనికిరాని పాత గుర్గితీర్గ అనిపిచ్చింది. అందుకోసం తనగొంతు గుమాస్తరంగయ్య గొంతు తోటిగల్పి "ఏం రోగం నీకు? నిండ దిని, కోడిగుయ్యక ముందె దొంగతనానికి మొదలైనవ్ ఆడిపోరివి గదా! మొగోణివన్న గావు. సిగ్గు లేదే?" అని ఉరిమిండు.

రాంరెడ్డి నోటిఎంట వొచ్చిన 'సిగ్గులేదు' 'ఆడిపోరివి' అన్న రొండుమాటలు నాగి రొండుచెవుల్లపడి, గింగురు గింగురుమనుకుంట సుళ్ళుదిరుగుతున్నవి, పాపం నాగికి ఇంతవరకు తను ఆడిదో, మొగోడో తెల్వలేదు. అవును, నిజంగనే తను ఆడిపోరి, కొంచెం సిగ్గైంది; గని, ఆసిగ్గు అప్పుడే చిట్లిపోయి "అవద్దం నేను కడ్పునిండ దిన్న నంట! యాడ దిన్న? ఎప్పుడు దిన్న? నాకు బువ్వ యాడుండది?" అని అనుకోని రాంరెడ్డిదొర దిక్కుజూసుకుంట, "దొర, నాకు నిన్నగూడంగ ముంజకాయలు దొర్కలేదు. ఉపాసం బండు కుంటె పొద్దున లేవంగనె కడ్పుల ఒక్కటే గోకుడు మంట అందుకే ఇంటెనిక గోడ దుంకి, మొక్కజొన్న సేండ్లవడి రొండు కంకులు నమిల్న" అని చెప్పుతుంటె నాగి మణిసిపిల్ల గాకుండ పల్పుఇడ్సిన పెయ్య దూడోలె అనిపిచ్చి రాంరెడ్డి నెత్తి గిర్రగిర్ర దిరిగింది. "అయ్యో! భగువంతుడా! ఇదేనా నాపల్లె? నాఊరు? కల్లకపటంలేక, పాడి పంటలతోటి ఉండవల్సిన ఊరు ఈ ఊళ్ల ఎంత మురికి, మురుగు, మూర్కం నిండుకున్నది. ఈ దరిద్రం బోయే దెట్ల?" అని ఆలోచనజేసి "నాగీ! మరి కూలిజేస్క

బత్కురాదే?" అన్నడు. "దొర, పొట్టల ఎల్కలు పొర్లుతుంటె కూలి ఎట్లజేస్త? మంట సల్లవడనీకె యాదన్నదింటె దొంగనాగినని నాకు పని ఎవ్వరు జూపరు. కూలి నూకలో కుచ్చపుదుడ్లో దేకపోతే మాఅవ్వ గంజి వోయదు. బువ్వ, గంజి అని ఏడిస్తే "నీకు మారెమ్మవట్ట గత్తర్లగొట్కపోను! నీ కుంపటి పాడుగాను! పో, బిచ్చెంఎత్కపో!" అంటది. కూలి ఇయ్యనోళ్లు బిచ్చెం ఎవ్వరిస్తరు? బిచ్చెం అడ్గితె నాకు ఇకారం అనిపిచ్చింది. అందికే బీరుడు నేను గల్సి ఈ పనినేర్సుకున్నం." అని యా దాపిరికం లేకుండజెప్పింది.

ఈమాట లింటున్న రాంరెడ్డికి ఎవరో తనతప్పు తన వొళ్లె ఏసి, ఎట్లసవరిచ్చుకుంట వో సూడు అని వారగండ్ల జూసినట్లనిపిచ్చింది, దీంతోటి ఆపోరికి తనేందో ఋణపడ్డట్లు, ఆబరువు అంత తన నెత్తిన్నే మోస్తున్నట్లనిపిచ్చింది. అవును 'పెంటకుప్పలన్ని దులుపంగ దులుపంగ ఒక్కమంచిరాయన్న కండ్లవడక పోతదా? సేతులల్ల కెళ్ళిదప్పి మన ఓగుమాలినపని తోటి ఎన్ని ముత్యాలు దొళ్ళిపోయి పెంట అడ్గున జేర్నవో' అని అనుకుంట, ఆడున్న సిన్నా పెద్ద వొద్దంటున్న గూడ పెడచెవిన బెట్టి "నాగి, నేను పొట్టనిండఅన్నంబెడ్త, పై నిండ బట్టలిస్త ఈ దొంగతనం గింగతనం మాని పనిజేస్తవ?" అని అడ్గిండు. "పనిగిని అటెంక జేస్తగని ముందు నాకు బువ్వపెట్టు. ఈ సింపు ఇడిస్తె కట్టుకోనికె మారుసింపు లేదు, నా కోబట్టయియ్యి. ఇంగో! మళ్ళ నన్ను దొంగనాగి గింగనాగి అంటె ఊకోను, ఎర్కేనా?" అన్నది. ఈ మాట ఇని రంగయ్య "ఆమ్మో మొండిఘటం! థూ అంటె బలా అని దొరల ముందల్నె గంటగొట్టినట్లు మాట్లాడుతుండది. దొమ్మరిసాని కుదురుగ గూసోని పని జేస్తాది? ఇదెక్కడ ఇముడ్తది మనింట్ల? తోడ్కలుదీసి ఏళ్ళదన్నుండి" అన్నడు, అవేం బట్టిచ్చుకోకుండ రాంరెడ్డి, "నాగి పో మోటబాయికాల్వల కాళ్ళు మొకం గడుక్కొని రా పో". అని ఇంట్లకు పోయి తనదో పాత దోతి దెచ్చి దాని చేతులల్ల ఇసిరిండు.

రాంరెడ్డి ఇంట్ల జేరి నేల్లాళ్ళు దిర్గినవో లేదో గని, నాగి చెంపలు కండవెట్టి గుంతలు పూడినవి. నిగ నిగ మనుకుంట పై వొంపులు జూపుతుండది. క్షణం క్షణం ఆ పిల్ల అన్నిదిక్కులకెల్లి ఎదుగు కుంట వొస్తుండది. తాను నాటిన ఇత్తు మొలుకెత్తి ఆకుదొడ్గి ఈరాకు మారుకు వడి రెమ్మవెట్టి ఇగురేసి మొగ్గ దొడ్గుతె, మురిసినట్లు మురుస్తుండడు రాంరెడ్డి. ఆఖరికి తాను ఓడ్తడో గెలుస్తడో గని, చేసే యత్నం జేయుంగమిగతాదిదైవయత్నం అన్నరు. ఈ పిల్ల గుణంమారి మంచిదైతె, అది ఒక పనికిరాని గొడ్డుగ గాకుండ, భూమికి బరువు గాకుండ మనిసైతె ఏంత బాగుండు? తాను మొదలుపెట్టిన పని తాను సదువుకున్న సదువు సార్తకం అయితుండెగదా! అని అనుకుంటెండె. ఇంగ కండ్లల్ల వొత్తేసుకోని చూసినట్లు నాగి నడ్త కనిపెడ్తుండె.

నాగి ఆయింట్ల జేరిన యాళ్ళ బలమో రాంరెడ్డి మనుసులోని మంచి బలమో పెట్టిపుట్టిన నాగి అదృష్టబలమో గని నాగి రాంగ రాంగ గుర్తు పట్టనట్లు బదులాయించింది. పోరి

యా పని జేసినా సూడసొంపు. దాన్ని వోడిచ్చేటోళ్ళే లేరు. నడుంగట్టి వొడ్లు దంచిందంటె స్యావగల్లమొగోడె ఎన్క్కకు ఒరుగాలె. ఇందాక అది ఆడివిల్లలల్ల లెక్కగాదు. అసలుకు మనుష లల్లనే లెక్కగాదు. గసొంటి నాగి ఇప్పుడు గంపెడు తుప్పులు తెట్టె వెట్టినట్లు నెత్తినిండ ఉంటె, దాని కర్రెటి కండ్ల నలుపు ఈ దిక్కు ఆదిక్కు సీకట్లు గప్పుతుంటె, సెవులకు వెట్టిన పూసలపోగులు ఇక్కడక్కడ ఊగుతుంటె, మళ్ళ మళ్ళ నడికట్టు ఇడ్సి మొకాన సెమట దుడ్సుకొని కొంగు జెక్కినప్పుడల్ల ఆదిక్కున మనసు సెదురని మొగోడే లేడంటె ఇచ్చిత్రం ఏం గాదు. గని పాపం నాగి ఇంకా ఎడ్డె గొడ్డె. యా మిటారిసెబ్కులు దాని పొలిమెర్లనే లేవు. దాని మనుగడలోని ఒక్కొక్కనరం ల, ఒక్కొక్క నెత్తుటి బొట్టుల రాంరెడ్డే నిండుకున్నడు. దాని బతుకంత ఆయనకే ఎత్తుకట్టు, ఆఊళ్ళ ఆ రూపుతోటి నాగికి కండ్లువడ్తున్న ఎంకటేశుడు, అనుమాండ్లు రాంరెడ్డి. రాంరెడ్డీ ఆయన మాట మినహాయిస్తె నాగికి ఇంగో లోకమేలేదు. ఉన్నా దానికి వొద్దు. ఆ మంచిగుణాలకు ఆ పేరుంటదని పాపం దానికి దెల్వదు గని, పెద్ద పెద్ద పేర్లున్న ఆగుణాలన్ని దాన్ని జేరినవి.

ఊళ్ళ అందరికన్ను ఇప్పుడు నాగి మీదనె. ఎట్ల? ఈ పిట్టను గొట్కపోదామా? అని చూసె టోళ్ళె. ఒగనాడు పట్వారిపంతులొచ్చి "నాగమ్మ, ఓసారి ఇంటిదిక్కు రా రాదే?" అని విల్సిండు. "ఏం పనో పంతుల్కు?" అని అడ్గితె నీళ్ళునమిలి "ఏంలేదు. పూటకు రొండు రూపాలు. రొండుశేర్ల పోటువెట్టినబియ్యం గొలుస్త జెర ఆసర్తై పో." అన్నడు. దానికా పోరి "అయ్య! పంతులు, దొంగనాగి దోసిళ్ళకొద్దికి బుక్కుతది గని, దంచు తా దయ్యా? ఏం మొకం బెట్టుకోని పిలువొచ్చినవయ్యో! అంత కూడులేక మాడిసచ్చేదినమే వొస్తె మా సిన్నదొర పాదాలకాడ పడి ప్రాణంఇడుస్త గని ఈజీవి ఉండంగ ఈ కడ్పదాటను. పో! పో! ఏంముద్దుగ అడ్గొచ్చినవ్. మర్శిగిట్ల మళ్ళ ఆమాట నాల్కెదాటనిచ్చేవ్?" అని ముక్కుమొకం జూడకుండ దులిపి ఇడ్సివెట్టింది.

రాంరెడ్డి ఇంట్ల పని యావత్తు జూసుకునేది ఇల్లంత గిర్క తీర్గ దిర్గుకుంట కావలికుక్కతీరు కాపాడేది. తండ్రీకొడుకులు యా పనివడి పిల్సిన కో అంటె ఓ అన్నట్లు అందువాట్ల ఉండి అన్ని కైగ తీర్చిదిద్దేది. ఇదంత జూసి చంద్రలోకంనుండి భూమిని జూసినట్లు సంబురాన పొంగుతడు రాంరెడ్డి. పెద్దపటేలు గూడ నాగి అంటె ప్రాణంబోగొట్టుకుంటున్నడు. దగ్గెరదగ్గెర అరువైవో పడిలవడ్డ పటేలుగూడ తనలోపల పిడ్సగట్టుకపోయిన తీపినంత వొల్కవోసుకుంట "అమ్మా! నాగలూ! తిన్నావే?" అని అడ్గుతుంటె, కొడుక్కు తన ఇంట్ల ఉన్న అందరి మనుసులు తరువంగ తరువంగ అచ్చమైనఎన్నముద్దొలె ఈ మమకారం బుట్టుకొచ్చిందే మొ అని అనుకుంట సంతోషంతోటి ఉట్టి ఊగినట్లు ఊగుతుండె.

అప్పుడప్పుడే ముసి ముసి సీకట్లు వడుతున్నవి. కంచెలకువోయిన ఆవులు నిండినపొదుగుల్తోటి బిడ్డలకు ఎప్పుడెప్పుడు దారయిద్దమా అని అంబా, అంబా

అనుకుంటవొస్తుండవి. ఈసారి మెదకు దగ్గ గింజరాలింది. తెచ్చిన బండ్లు జాలక పాయె నని సంచులల్ల నింపి, మిగిల్నగింజలు ఇల్లు జేరుస్తుండరు. రాంరెడ్డి పద్దేసు కుంట గూసున్నడు. నాగి పాలదాయిల పిడ్కేసి, ప్రమిదల ఆయిందం బోసి కచ్చేరిగూట్ల వెట్టి ఇంటెన్కకువోయి బర్తి మోసిన జోడెద్దులకు గాన్గవిండి వెడ్తుండది. కర్ణంపంతులు ఇంటిమనిషి ఈ డ్కెళ్ళి ఆడ్కి అడ్కెళ్ళి ఈడ్కి యాదో సూపెట్టుకొని తిర్గు తుండడు. యావో గుస గుసలు పిస పిసలు కొట్టం పక్కసందుల కెల్లి ఇనవడ్తుండవి. ఏందో గని ఈనడ్క అంత అనుమానంగనే అనిపిచ్చింది నాగికి. ఎట్లైన గాని అని దాణబుట్ట ఆణ్నే వారేసి పిల్సోలె మెల్లగవోయి మునిగాళ్ళమీద నిలవడి, సందులకు పారజూసింది. సందుసివర్ల కల్లం నుండిదప్పిచ్చిన బండి బర్తితోటి నిలవడ్డది. ఒక్కసారి నాగికండ్లు మెరుపు మెరిసినట్లైనవి. కొంగుపెద్దగగుంజి పిడిసుట్టుగట్టి, సప్రంలజెక్కిన సెర్లకోల గుంజి సేతుల వట్టుకొని బర్తిబండి కాడికి వోయి నిలవడి "ఎంకయ్యా! బండి సీకట్ల ఇక్కడ యాడికి మళ్ళిందయ్యో! అళ్ళియ్యి ఇంటిముందరికి. అమ్మో! రంగయ్యపంతులు! ధర్మదోనివి కడ్పుకుజాలక నా? తిన్నదిఅర్గకనా? గీ లేకిడిపని? కడ్పుకులేక రొండుకంకులు దింటె నాగి రొండుకంకులేంది? రొండు ఊళ్ళు మింగు తదని తప్పెట గొడ్తివి గదా! ఇప్పుడు యాది గాలి? ఈ ఎంగిలికూటికి ఆశపడ్తివయా? నీ విప్పుడు ఎన్నిఊళ్ళు మింగుత వనాలె? గుళ్ళె వుండి గుడిరాళ్ళుగుంజినట్లు, కొల్వుగానివి దొర గుమాస్తవు ఉప్పుదిన్న గురుత్వం గూడ లేకుండ దొరకండ్లుగప్పి దొరసొమ్ము ఆ పాపిష్టికర్ణపోణి ఇంటికి జేరేస్తావ్" అని "ఈణ్నుండి గదులు సూతం! ఎట్ల గదుల్తవో!" అని అంటుంటె ఈ రంతు యిని రాంరెడ్డి, పెద్దపటేలు అందరు ఆడ్కివొచ్చిండ్రు. చేతుల చెర్లకోలవట్టుకోని నిలవడ్డ నాగి మహంకాళి చెండిక తీర్గ అనిపిచ్చింది.

ఇదిజూసి "గింజలుంటే ఉన్నవి పోతే పోయినయి. అదో పెద్దలెక్క గాదుగని, తన కష్టందక్కింది. తానో నిండుప్రాణాన్ని నిలబెట్టిండు. రాలిపోయిన మణిపూసను మళ్ళ దారంల గుచ్చి దండనుగల్పిండు" అన్న సంబురాన "నాగీ!" అని రొండుచేతులు వట్టుకున్నడు రాంరెడ్డి. "దొరా!" అనుకుంట నాగి రాంరెడ్డి రొండుపాదాలకు అల్లుకపోయింది.

*(1973లో ప్రచురించిన 'మా ఊరి ముచ్చట్లు'*
*కథాసంపుటి నుంచి....)*